నేడు దోమకొండ కోటలో 'తెలంగాణ సాహిత్య సమాలోచన'

దోమకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గడికోటలో ఆదివారం తెలంగాణ సాహిత్య సమాలోచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గడికోట మేనేజర్ బాబ్జి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య వెలుదండ నిత్యానందరావు(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్)ఆత్మీయ అతిథి పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి, విశిష్ట అతిథి ఆశిష్ సాంగ్వాన్ కామారెడ్డి కలెక్టర్, సంధానకర్త ఉమా శేషారావుతో పాటు చాలా మంది కవులు, అతిథులు హాజరవుతారని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



రైస్‌మిల్లులోని సీఎంఆర్ రైస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అధికారులు (ఫైల్)

- జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లులు
- ఇప్పటికీ ప్రభుత్వానికి చేరని కస్టం మిల్లింగ్ రైస్
- రెండు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే..
- 1.50లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్ల వద్దే
- కస్టం బియ్యం ఇవ్వడంలో సాకులు చెబుతున్న మిల్లర్లు
- సీఎంఆర్ ఇవ్వని రెండు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు
- గడువులోగా ఇవ్వకుంటే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు
- జిల్లాలో 136 రా.. మరో 35 బాయిల్డ్ రైస్‌మిల్లులు

సీఎంఆర్‌పై నజర్

కామారెడ్డి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ఏడాది వానాకాలం, ఎండాకాలం సీజన్‌లో రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యం ఇవ్వాల్సిన రైస్ మిల్లర్లు ఇవ్వకపోవడంతో వారిపై దృష్టి సారించింది. ఈ నెలాఖరు వరకు బియ్యం ఇవ్వని మిల్లర్లపై కొరడా ఝులిపించాలని ఎంతటి వారినైన సరే కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు మిల్లర్లపై నిఘా పెట్టడమే కాకుండా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సీఎంఆర్ ఇవ్వాలంటూ మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. రెండు సీజన్‌లకు సంబంధించి మిల్లర్ల నుంచి ఇంకా ప్రభుత్వానికి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.

జిల్లాలో 171 రైస్‌మిల్లులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 171 రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైస్‌మిల్లులు ఉండగా మరో 35కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 557 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీనెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.46 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5,450 మెట్రిక్ టనున్నల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి ప్రతీఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించే ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేస్తుంటారు.

రెండు సీజన్‌ల సీఎంఆర్ మిల్లుల్లోనే..

జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికార యంత్రాంగం ఆయా రైస్‌మిల్లులకు కేటాయించి తిరిగి సీఎంఆర్ రూపంలో బియ్యాన్ని సేకరించాల్సి ఉంటుంది. అయితే గత ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్‌ను ఆయా మిల్లర్లు సకాలంలో పెట్టలేదు. 2023-24 వానాకాలం సీజన్‌కు సంబంధించి ఆయా రైస్‌మిల్లర్లు 2,97,758 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.80లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు తిరిగి అప్పగించారు. ఇంకా 17,850 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. ఇక అదే సంవత్సరం యాసంగి సీజన్‌కు సంబంధించి 1.32లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిలర్ల నుంచి రావాల్సి ఉంది. ఈ సీజన్‌లో 2.02లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 70,284 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇలా గత రెండు సీజన్‌లకు సంబంధించి 1.50లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్ల వద్దే ఉంది. అదేవిధంగా 2024-25 వానాకాలంకు సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన 4.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించారు.

సీఎంఆర్ ఇవ్వని రెండు మిల్లులపై క్రిమినల్ కేసులు


జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్ సకాలంలో ఇవ్వని రైస్‌మిల్లులపై జిల్లా అధికారులు కఠినంగానే వ్యవహరిస్తున్నారు. సకాలంలో పెట్టని రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. సీఎంఆర్ రైస్ కేటాయింపుపై నేరుగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజూ రైస్‌మిల్లర్లు సీఎంఆర్ రైస్ పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల సీఎంఆర్ పెట్టని ఇద్దరు రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రైస్‌మిల్లర్లతో తరచూ సమీక్ష నిర్వహిస్తూ బియ్యం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎంఆర్ ఆలస్యంపై మిల్లర్లపై ఒత్తిడి

గత వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ గడువు ఇది వరకే ముగిసింది. అయితే మిల్లుల యాజమాన్యాలు కోరిన నేపథ్యంలో పలుమార్లు గడువును పొడిగించారు. గత సీజన్‌కు కూడా గడువు దగ్గర పడుతోంది. అయితే దీనికి మరోమారు పెంచేందుకు అవకాశం ఉండడంతో మిల్లుల యాజమాన్యాల జోలికి వెళ్లడం లేదని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని గోదాంలు ఖాళీ లేకపోవడం సీఎంఆర్ రైస్‌తో నిండుగా ఉండడంతో మిల్లర్లు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో మిల్లులకు కేటాయింపు, వాటిని తిరిగి ఎఫ్‌సీఐ సేకరణ ప్రారంభంలో కొంత ఆలస్యం చోటు చేసుకుంది. దీంతో సీఎంఆర్ అప్పగించడానికి కొందరు వెసులుబాటు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వానాకాలం, యాసంగి విషయంలో ఇప్పటికే ఆలస్యం అవడంతో అధికారులు మిల్లర్లు ఒత్తిడి పెంచుతున్నారు.

నిజాంసాగర్‌లో పర్యాటక అభివృద్ధి అయ్యేనా?

- రెండు నెలల క్రితమే రెవెన్యూ యంత్రాంగం 12 ఎకరాల 20 గుంటల భూమి టూరిజంకు అప్పగింత
- డిసెంబరులో ఏకో టూరిజం ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలించిన భారీ నీటి పారుదల శాఖ మంత్రి
- ఏకో టూరిజం ఏర్పాటు ఊసే లేదు
- ఉభయ జిల్లాల వాసుల ఎదురు చూపులు



7

తాడ్వాయిలో జోరుగా బెల్టు దందా

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు
- పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్న మద్యం
- తాగుడుకు బానిసై వివాదాల్లో చిక్కుకుంటున్న యువత



7

ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుకు క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు క్షేత్ర పరిశీలన, జాబితా తయారీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఈనెల 15 నాటికి రైతుభరోసా కార్యక్రమం కింద సన్నాహక ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. గుట్టలు, రోడ్లు, నాలా కన్వర్షన్, భూ సేకరణ, లేఅవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను పరిశీలించాలని తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు క్షేత్రపర్యటన చేసి డేటా సిద్ధం చేయాలని సూచించారు. గ్రామసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటామన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలు కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన డేటాను సిద్ధం చేయాలని సూచించారు. ఆధార్ నెంబర్ మ్యాపింగ్ చేయడం, గ్రామసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారు గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు. తుది నిర్ణయం గ్రామ, వార్డుసభలో చర్చిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు 5 శాతం సూపర్ చెక్ చేయాలని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు



భిక్కనూరులో ముగ్గులు వేసిన విద్యార్థినులు



కామారెడ్డిలో..

కామారెడ్డి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్కే గ్రూప్ ఆఫ్ కళాశాలల ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంచి ముగ్గు వేసిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి ప్రతిభను ఉపయోగించి వేసిన ముగ్గులు విభిన్న అంశాలను ప్రతిబింబించేలా ఉన్నాయన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు మన సంస్కృతిపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సైదయ్య, దత్తాద్రి, నవీన్, శంకర్, నరేష్, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు, ఏవో తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: భిక్కనూరు మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాల, చైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తీరొక్క ముగ్గులు వేసి రంగులు వేసి విద్యార్థినులు కోలాటాలు ఆడారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రాంగణంలో బొమ్మరిళ్లు ఏర్పాలు చేసి పిండి వంటలు చేసి, బోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు విజయ్‌భాస్కర్, రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్‌యాదవ్, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్పీ

కామారెడ్డి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సింధూశర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊరికి వెళ్లే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు, బంగారం ఆభరణాలు పెట్టవద్దని వాటిని బ్యాంక్ లాకర్‌లో లేదా భద్రంగా ఉన్నచోట దాచుకోవడం ఉత్తమమని తెలిపారు. బీరువా తాళం చెవులు బీరువా పైన కాని, బీరువాలోని బట్టల కింద, ఇంట్లో పెట్టి వెళ్లవద్దని, వాహనాలను ఇంటి వద్దనే పార్క్ చేసి తాళం చెవులువు వెంట తీసుకుని వెళితే మంచిదని తెలిపారు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దని, ఇళ్లకు నాసిరకం తాళాలు వాడవద్దని, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలని సూచించారు. తలుపులు ఉంచి బయటగేటుకు లోపల నుంచి తాళం వేయాలని పేపర్‌బాయ్, పాలు వేసే వాళ్లకు రావద్దని తెలపాలని అన్నారు. నమ్మకమైన వారికి, స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. బయటకు వెళ్లిన, వాకిట్లో ముగ్గులు వేసిన మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలని వీలైతే చీరకొంగుతో కవర్ చేసుకుంటే మంచిదని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరిమీదైన అనుమానం వస్తే 100 డయల్ లేదా కామారెడ్డి పోలీసు కంట్రోల్ రూమ్ 8712686133కు డయల్ చేయాలని తెలిపారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో కాసర్ల శివరాజయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో తీవ్ర ఒత్తిడిలకు గురవుతూ ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కనీసం ఒక గంట అయినా క్రీడలు ఆడేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తించేందుకు టోర్నమెంట్‌లు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కాసర్ల రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, వేణు, రజినీకాంత్, గోవర్ధన్, లింగం తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

ఫటా..ఫట్...

క్యూఆర్‌కోడ్ వాల్ పోస్టర్లు ఏర్పాటు చేశాం

● లింగంపేట్ ఎస్సై సుధాకర్



ఆంధ్రజ్యోతి: ఏదైనా ఫిర్యాదు దారునికి పోలీసుల నుంచి సరియైన న్యాయం జరగకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన విధానం ఏమిటి?

ఎస్సై: పోలీసుల పనితీరులో దరఖాస్తు దారునికి ఏమైనా ఇబ్బందులు కలిగినా పోలీసులు సరిగా స్పందిచకపోయినా ఫిర్యాదు దారులు నేరుగా ఉన్నతాధికారులకు పిర్యాదు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవలపై ప్రజాభిప్రాయం కోరుతూ క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్లను పోలీస్ స్టేషన్‌లోను ఇతర ప్రాంతాలలోను ఏర్పాటుచేశాం.

ఆంధ్రజ్యోతి: ఇటీవల సైబర్ నేరాల భారిన పడి అమాయకులు డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు ఆందోళనలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు వీటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: మండలంలోని బస్టాలు,ప్రాధాన కూడళ్లవద్ద, పాఠశాలలు, కళాశాలలు, వారాంతపు సంతలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాము. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు అకౌంట్ వివరాలు, వాట్సప్‌లోని ఇతర లింకులను ఒపెన్ చేయవద్దని లోన్ యాప్స్ పేరుతో, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో, సర్వేల పేరుతో ఎవరైనా ఫోన్ చేసినా వారికి ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని హెచ్చరిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: సంక్రతి పండుగ సందర్భంగా ఇళ్లకు తాళం వేసి ఇతర ఊర్లకు వెళ్లేవారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?

ఎస్సై: సంక్రతి పండుగతో పాటు, ఇతర సెలవులు, వేడుకలకు రెండు నుంచి మూడు రోజుల పాటు ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు వారి ఇంటి అడ్రస్‌తో పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లితే పెట్రోలింగ్ సమయంలో ఆప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: మండలంలో ఇటీవల జరిగిన రెండు దొంగతనాలకు సంబంధించి దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించాం. రాత్రి వెళల్లో పెట్రోలింగ్ చేపడుతున్నాం. రాత్రులలో అనుమానితుల ఫింగర్ ప్రింట్‌లను చెకట్ చేస్తున్నాం. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచి వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు వాహనాల తనిఖీ చేపట్టి లైసన్స్‌లు, వాహనాల పత్రాలు లేనివారికి, హెల్మెట్ ధరించని వారికి, అతి వేగంగా వెళ్లేవారికి, ఓవర్‌లోడ్ వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. రహదారిపై రోడ్డు భద్రత బోర్డులను ఏర్పాటు చేశాం. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ప్రాధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు పని చేస్తున్నాయా?

ఎస్సై: గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు పని చేస్తున్నాయి. మరికొన్ని గ్రామాలలో సీసీ కెమరాలను ఏర్పాటు చేస్తాం. మండల కేంద్రంలోను ప్రధాన షాపుల వద్ద దుకాణ యజమానులు సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: పేకాట, జూదం లాంటివి ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంజాయి లాంటి మత్తు పదార్థాలు పెంచినా, కలిగి ఉన్నా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ఇలాంటి వాటిపై సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తాం. సమాచారం అందించిన వారి పేరు సీకెట్‌గా ఉంచుతాం.

● (ఆంధ్రజ్యోతి, లింగంపేట)

పొతంగల్‌లో ఇసుక డంప్‌ల సీజ్



పొతంగల్‌లో ఇసుక డంప్‌లను సీజ్ చేసిన దృశ్యం

కోటగిరి,జనవరి11(ఆంధ్రజ్యోతి):పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 100ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం రాత్రి ఇన్‌చార్జి తహసీల్దార్ సురేందర్‌నాయక్ సీజ్ చేశారు. కొందరు ఇసుక అక్రమార్కులు ఇసుకను పెద్ద మొత్తంలో డంప్ చేశారని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సమాచారం అందించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుకను సీజ్ చేశారు.అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శనివారం ప్రభుత్వ పనుల కోసం తరలించారు.ఇసుకను రవాణా చేసినా, నిల్వ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

● ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: ఎటువంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్, టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం అర్థరాత్రి సమయంలో మొగిలిపుర నుండి కందకుర్తి శివారు నుండి బోర్గాం వైపు వస్తున్న ఇసుకను టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పరిశీలించగా ఎటువంటి అనుమతి లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. కొప్పర్గ నుండి సాటాపూర్ వైపు వస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను నీలాక్యాంప్ వద్ద పట్టుకున్నామన్నారు. రెంజల్ పోలీస్ స్టేషన్‌కుతరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు సమాచారం అందించడం జరిగిందని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేబుల్ వైరు చోరీ

నవీపేట,జనవరి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దాస్ గెస్టహౌస్‌లో ఉన్న బోరుబావికి చెందిన కెబుల్ వైరు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. కెబుల్ వైర్‌తో పాటు అక్కడే ఉన్న రెండు ప్లాస్టిక్ సుట్టలను సైతం ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు సమాచారం అందించడం జరిగిందని గెస్ట్ హౌస్ నిర్వాహకులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటగిరి,జనవరి11(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బీజేపీ కార్యకర్త జాదవ్ గజానన్ కుటుంబానికి కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రూ.10వేల ఆర్థిక సహయం అందజేశారు. ఎత్తొండ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కోనేరు శాశంక్ తన ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సహయంతో పాటు వారి కుటుంబానికి, పిల్లల చదువుకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఏముల నవీన్, నాయకులు జగదీష్, రోషన్, శివకుమార్, సాయిలు, నీలేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డల కుటుంబానికి కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఆసరా

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పొతంగల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న పోచారం

కోటగిరి,జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల కుటుంబానికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో శనివారం 62మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రైతులకు బోనస్ ఇవ్వడంతో పాటు రైతు భరోసాను త్వరలోనే ఇవ్వనుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, శంకర్ నాయక్, మండల నాయకులు ఏజాజ్‌ఖాన్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు

వర్ని: తల్లిదండ్రులకు భారం కాకుండా ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఇవ్వడం వరంగా భావిస్తున్నట్లు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నమూనా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో అన్ని గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి రూ.5లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఆడ బిడ్డలు పొట్టతో ఉన్నప్పటి నుంచి ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ఏడాది పాటు తప్పనిసరి తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, విండో చైర్మన్ సాయిబాబా,మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, నాయకులు నేమాని వీర్రాజు, సింగంపల్లి గంగారాం, గోపాల్, రంజ్యా నాయక్ పాల్గొన్నారు.

పండుగలకు వెళ్లే వారు జాగ్రత్త వహించాలి

రెంజల్,జనవరి11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు తమతమ గ్రామాలకు వెళ్లే వారు జాగ్రత్త వహించాలని ఎస్‌ఐ సాయన్న సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ చుట్టు పక్కల వారికి తమ ఇంటిని గమనించాలని కోరాలని అన్నారు. విలువైన ఆభరణాలు, సొమ్ము ఉంటే బ్యాంకులో భద్రపర్చుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు ఉంటే దొంగలు దొంగతనానికి పాల్పడుతున్నారని, దూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులతో పాటు తమ చుట్టు పక్కల వారికి సమాచారం అందించాలన్నారు. పండుగ సందర్భంగా పలు జాగ్రత్తలు వహించాలని, పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో విలువైన వస్తువులు ఇంటిలో ఉంచకూడదని అన్నారు.

కమ్మర్‌పల్లి: పడగలకు ఊరెళ్లే కుటుంబాలు తస్మాత్ జాగ్రత్త మీరు మీకుటుంబస్యులతో కలిసి పండుగలకు ఊరెళ్లేతే పోలీసులువారి సలహాలను తూచా తప్పకుండా పాటించాలని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి సూచించారు. ఊరెళ్లే కుటుంబాలు మీవిలువైన వస్తువులు ఇంట్లో కాకుండా బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలి. ఊరెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టులు చేయవొద్ద, మీ ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంమ్ వినియోగించుకోవాలి, ఊరెళ్లే కుటుంబాలు తమ వివరాలు స్థానిక పోలీసులకు తెలియపర్చాలి, ఇళ్లలో ఉన్న సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో(మీ ఫోన్‌లో)తరుచూ గమనిస్తు ఉండాలి, అపరిచత వ్యక్తులు అగుపిస్తే పోలీసులకు సమాచారం అదివ్వాలి, శివారు ప్రాంతంలో తాళం వేసిఉన్న ఇళ్లను అపరిచిత వ్యక్తులు, ఉదయంపూట గమనించడం రాత్రిళ్ల చోరిలకు పాల్పడడం జరుగుతుంది. అట్టి వ్యక్తులను గమనిస్తూ ఉండాలి. తాళంవేసి ఊళ్లకు వెరెళ్లితే పక్కనున్న ఇరుగు, పొరుగువారిని గమనించమని చెప్పి వెళ్లండి. వారి నుంచి మీఇంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుకుంటు ఉండండి. కుటుంబ సభ్యులు ఊళ్లకు వెళ్లగా ఇంట్లో ఉన్న వృద్ధులు, మహిళల ద్వారా అపరిచిత వ్యకు వస్తే వారికి ఎలాంటి సమాచారం ఇవ్వవొద్దు. తమతమ కాలనీల్లో గస్తీదళాలు ఏర్పటు చేసుకుని ప్రతి రోజు గస్తి తిరగాలి. అపరిచిత వ్యక్తులు తారస పడితే వారి సమాచారాన్ని స్థానిక పోలీసులకు, లేదా 100 కు డైల్‌చేసి చెప్పాలని ఎస్సై సూచించారు.

పండగ కొరకు వెళ్లే వారు సమాచారం ఇవ్వాలి

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గామాల ప్రజలకు సంక్రాంతి పండగకు పురస్కరించుకొని మీ బంధువుల ఇంటికి, మీ సొంత గ్రామాలకు వెళ్తే వారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మీరు వెళ్లే ప్రదేశాల గురించి సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దన్నారు.ఇంట్లో,బయట సీసీ కెమెరాలను అమర్చుకోవాలనిసూచించారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, డబ్బులు ఉంటే వెంట తీసుకుపోవాలని చెప్పారు. లేని పక్షంలో బ్యాంకు లాకర్‌లో ఉంచాలని సూచించారు. ఇంటి నుంచి వేరే గ్రామానికి వెళ్లి నప్పుడు ఇంటి లోపల ఏదో ఒక హాల్‌లో లైట్ వేసి ఉంచాలని, బయట డోర్ వేసి లాక్‌పై డోర్‌కటన్‌లు ఉంచాలన్నారు.వేరే గ్రామానికి వెళ్లినప్పుడు ఇంటి పక్క వారికి, తెలిసిన వారికి ఉదయం,సాయంత్రం సమయాల్లో నిఘా వేసి ఉంచాలని సూచించారు. ఏదైన సమస్య ఉంటే 100కు డయల్ చేయా లని, తగిన జాగ్రత్తలు తీసుకొని ఊరికి వెళ్ళాలని ఆయన మండల ప్రజలకు సూచించారు.



ఎస్సై సాయన్న

● పండుగకు ఊరికి వెళ్తే జర జాగ్రత్త

ధర్పల్లి: రానున్న సంక్రాంతి పండగకు కుటుంబసభ్యులతో గ్రామానికి వెళ్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్సై రామకృష్ణ శనివారం వివరించారు. మీరు వెళ్లే ప్రదేశాల గురించి సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దన్నారు. ఇంట్లో, బయట సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, డబ్బులు ఉంటే వెంట తీసుకుపోవాలని చెప్పారు. లేని పక్షంలో బ్యాంకు లాకర్‌లో ఉంచాలని సూచించారు. ఇంటి నుంచి వేరే గ్రామానికి వెళ్ళినప్పుడు ఇంటి లోపల ఏదో ఒక హాల్‌లో లైట్ వేసి ఉంచాలని, బయట డోర్ వేసి లాక్‌పై డోర్‌కటన్‌లు ఉంచాలన్నారు. వేరే గ్రామానికి వెళ్ళినప్పుడు ఇంటి పక్క వారికి, తెలిసిన వారికి ఉదయం, సాయంత్రం సమయాల్లో నిఘా వేసి ఉంచాలని సూచించారు. ఏదైన సమస్య ఉంటే 100కు డయల్ చేయాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకొని ఊరికి వెళ్ళాలని ఆయన మండల ప్రజలకు సూచించారు.

చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు

రుద్రూరు, జనవరి 11 (ఆంధ్రజోతి): కిరాణా షాపుల్లో, కైట్ షాపుల్లో చైనా మాంజ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ సింధూ శర్మ ఆదేశాల మేరకు చైనా మాంజ విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. చైనా మాంజను ఉపయోగించి గాలి పటాలు ఎగురవేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు కూడా ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం అమినా, కొనగోలు చేసినా నేరమేనని, చైనా మాంజను అమ్మితే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా కూడా ఉందన్నారు. కావున చైనా మాంజను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో
మెజార్టీ సీట్ల సాధనకు కృషి చేయాలి

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్ల సాధనకు కాంగ్రెస్‌పార్టీ యూత్ విభాగం నాయకులు కృషిచేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైనా వెంకటేష్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల అసత్యపు ప్రచారాలను కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు తిప్పికొట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో భిక్కనూరు విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం

భిక్కనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సంఘమిత్ర పాఠశాలలో నిర్వహించిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ 78వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో భిక్కనూరు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బీఐఎస్ ఆహ్వానం మేరకు ఈ సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు నందిని, మహేష్, విశ్వక్, కీర్తన ప్రదర్శించిన ఫార్మర్స్ బాటన్, ఇన్సెక్ట్ రిపెలెంట్, స్మార్ట్ ఇరిగేషన్ ఫర్ అగ్రికల్చర్ ప్రాజెక్ట్‌లను రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులుతమ్మల రాజు, సరిత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆర్మూర్‌రూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భటి విక్రమార్క, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహయాన్ని అందించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్ మాట్లాడుతూ భూమిలేని వ్యవసాయ కుటుంబాలను ఆదుకునేం దుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రవీన్‌గౌడ్, రాజేశ్వర్, కటికే శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట,జనవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లికి చెందిన షేక్ కామబీ అనే 66సంవత్సరాల వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. శుక్రవారం రాత్రి జన్నేపల్లి క్రాసింగ్ నుంచి గ్రామం వైపు కామబీ నడుచుకుంటూ వెళ్తుండగా స్థానిక ప్రైవేటు పాఠశాల సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. వెంటనే బాధితురాలిని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన మండలంలోని నాడాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌కు సైతం గాయాలు కాగా అతడు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మృతురాలి మనువరాలు నిఖత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైల్వే గేటు కమాన్ వద్ద ఇరుక్కున్న లారీ

నవీపేట,జనవరి11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రైల్వేగేటు కమాన్ వద్ద శనివారం భారీ లోడ్‌తో ఉన్న లారీ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బాసర వైపు నుండి నిజామాబాద్ వైపు గోనె సంచుల లోడ్‌తో ఉన్న లారీ వెళ్తుండగా స్థానిక రైల్వే గేటు వద్ద పట్టాలు దాటిన తర్వాత రెండవ కమాన్ వద్ద లారీ ఇరుక్కుపోయింది. దీంతో రోడ్డు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఏఎస్‌ఐ గఫర్, ప్రొబెషనరీ ఎస్‌ఐ శైలేందర్, పోలీసు సిబ్బంది వచ్చి కమాన్ వద్ద ఇరుక్కుపోయిన లారీని బయటకు తీయించారు.



నవీపేట రైల్వే కమాన్ వద్ద ఇరుక్కున్న లారీ

కామ్రేడ్ సాయిలు ఆశయ సాధనకు కృషి చేయాలి

బోధన్‌రూరల్,జనవరి11(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ శావులం సాయిలు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ బోధన్ డివిజన్ సహయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద కామ్రేడ్ శావులం సాయిలు 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పడాల శంకర్, ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సీతారాం, పీవోడబ్ల్యూ అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, బీపాషా బేగం, రెహనా బేగం, పట్టణ నాయకులు ఎండీ. ఈర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మోరా, గాండ్లపేట్‌లలో పేకాట రాయుళ్ల అరెస్టు

మోర్తాడ్,జనవరి11(ఆంధ్రజ్యోతి):మండలంలోనిధర్మోరా,గాండ్లపేట్ శివారులో పేకాట ఆడుతున్న 13మందిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు.ధర్మోరా గ్రామశివారులో ఎనిమిదిమందిని అదుపులోకితీసుకొని రూ.5930లను, గాండ్లపేట్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని ప ట్టుకొని రూ.77వేల800స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జక్రాన్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా కన్నెపల్లి ప్రసాద్

జక్రాన్‌పల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల అధ్యక్షునిగా జక్రాన్‌పల్లికి చెందిన కన్నెపల్లి ప్రసాద్‌ను నియమించారు. శనివారం కన్నెపల్లి ప్రసాదకు ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్,ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా,పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు దినేష్‌కులచారి నియామక పత్రాన్ని అందజేశారు.ఈసందర్భంగా నూతనంగా జక్రాన్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నెపల్లి ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మం డల పార్టీ అధ్యక్షునిగా నియమించిన సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారికి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిజా మాబాద్‌రూరల్ కన్వీనర్ పద్మరెడ్డి, వాసు, బీజేపీ నాయకులు పాల్నొన్నారు.



కన్నెప్రసాద్‌కు నియమక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ,ఎమ్మెల్యేలు

డొంకేశ్వర్: బీజేపీ నూతన డొంకేశ్వర్ మండల అధ్యక్షుడిగా గాదేపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి చిన్నారెడ్డి ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చేతుల మీదుగా నియమకపత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవిని కేటాయించినందుకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

సెల్‌ఫోన్ అప్పగించిన సీఐ

మోర్తాడ్, జనవరి11(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్‌కు చెందిన రాజారాం బాలరాజు తన మొబైల్ ఫోన్‌ను మోర్తాడ్‌లో పొగొట్టుకున్నాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ఆదారంగా సెల్‌ఫోన్ ఆచూకీ కనుకున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సీఐ నవీన్ అప్పగించారని మోర్తాడ్ ఎస్సై విక్రం తెలిపారు.

బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడిగా మందుల బాలు



బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా మందుల బాలుకు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆర్మూర్‌టౌన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడిగా మందుల బాలును నియమిస్తూ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణలు నియామక పత్రాన్ని అందజేశారు. విద్యార్థిదశలో ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ నాయకుడిగా పని చేసిన అనంతరం బీజేవైఎం, బీజేపీలలో పలు పదవులను చేసి ప్రస్తుతం బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు నెరవేరుస్తున్న ఆయనను పార్టీ అధిష్టానం గుర్తించి రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందున నిరంతరం పార్టీ కొరకు పని చేస్తానని, తన ఎన్నికకు కృషి చేసిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సుర్బిర్యాల్‌లో లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మార చంద్రమోహన్ పంపిణీ చేశారు. సుర్బిర్యాల్, కోమన్‌పల్లి, మంథని, రాంపూర్, ఇస్సాపల్లి, పిప్రి గ్రామాలలో లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఇంటింటికి వెళ్ళి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇట్టెం జీవన్, లావన్, కటికె శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్, బద్దం రవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెం దిన ఐదు మంది బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు లను శనివారం మండల బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామా నికి చెందిన ఉలుమల గంగాధర్, దుంపల నర్సయ్య,తిరుపతి, ప్రసాద్, ఎన్ గౌతమిలకు రూ.లక్ష 15 వందల సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరు కాగా స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యలయంలో బాధితులకు, వారి కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంటికంటి నరేందర్, సంతరాజేశ్వర్, హనీఫ్,పార్శపుబాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో శనివారం బాధిత కుటుంబానికి ఆర్మూర్ నియోజక వర్గం ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహయ నిధి చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు. ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న మలావత్ కిరణ్‌కు రూ.26వేలు చెక్కును పంపిణి చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదారి నవీన్, జితేందర్, యోహాన్, రఘు, మొగులన్న, చిన్న తిరుపతి, సిహెచ్ రాజన్న, సిద్దు, సంతోష్, చిన్న గంగారాం, లక్ష్మణ్ సాయన్న, నారాయణ, రాజేందర్, కిషన్, సాయన్న, గంగారాం, నల్లన్న తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండలంలోని లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లికి చెందిన లావణ్యకు రూ.25వేలు సాయికుమార్‌కు రూ.17వేల 500, లింగన్నకు రూ.34వేలు, గంగుకు రూ.22వేలు, మహేష్‌కు రూ.17వేలు, స్వామికి రూ.14వేల 500, అరుణ్‌కు రూ.14వేలు, పోశన్నకు రూ.20వేలు, బండి మురళీకి రూ.13వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు., కొలిప్యాక్ గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీంఆర్ఎఫ్ చెక్కులను మాజీసింగిల్‌విండో చైర్మన్ మామిడి బాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్‌లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, అక్బర్, తిరుపతి, సుదీర్, జనార్ధన్, చిన్న గంగారాం, ప్రశాంత్, బాజన్న, దినేష్, శ్రీనివాస్, శంకర్, మోహన్, సాగర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీభాషిత విద్యార్థికి గోల్డ్‌మెడల్

ఆర్మూర్‌రూరల్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థి ఎల్.సిద్దార్థ షాట్‌పూట్ అండర్-14 విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు కరస్పాండెంట్ పొలపల్లి సుందర్ తెలిపారు. ఇటీవల ఇండో, నేపాల్ వారు సంయుక్తంగా నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ షాట్ పూట్ పోటీల్లో సిద్దార్థ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని కరస్పాండెంట్, ఉపాధ్యా యులు అభినందించారు.

బోధన్ ప్రభుత్వ ఉపాధ్యాయుల క్షేత్ర పర్యటన

బోధన్‌రూరల్,జనవరి11(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ సోషల్ ఉపాధ్యాయులు జేసీ స్కూల్ రాకాసిపేట్ శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా వరంగల్‌లోని కాకతీయుల కోట, వెయ్యి స్తంభాల గుడి, పాకల చెరువు, రామప్ప గుడి, లక్నవరం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయుల కాలం నాటి చరిత్రను విద్యార్థులకు బోధించడానికి ఈ క్షేత్ర పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రెటరీ సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, శ్రీలక్ష్మి, బాలాజీ, అబ్బయ్య, రాజన్న, కిషోర్, స్వరూప రాణి, పద్మ, జ్యోతి, శిరీషా, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

కమ్మర్‌పల్లి, జనవరి 11: (ఆంధ్రజ్యోతి) రోజురోజుకు మితిమీరి పోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగ యువత టార్గెట్ అవుతున్నారని కమ్మర్‌పలిలో ఎస్సై అనీల్ రెడ్డి అధ్వర్యంలో స్థానిక పోలీసులు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. శనివారం చౌట్‌పల్లి చౌరస్తాలోని దుర్గయ్య హోటల్‌వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైఐ నరేందర్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుల్ లింబాద్రి ఉన్నారు.

డ్రైనేజీలో పడి ఒకరి మృతి

ధర్పల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజీపేట గ్రామంలో డ్రైనేజీలో పడి ఒకరి మృతి చెందినట్టు ఎస్సై రామకృష్ణ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన జగదీశ్వర్(42) శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి బయలు దేరాడు. ఉదయం రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. ఉదయం 5గంటల ప్రాంతంలో గ్రామంలోని డ్రైనేజీలో పడి చనిపోయినట్టు గుర్తించారు. జగదీశ్వర్ గత కొద్దికాలంగా తాగుడికి బానిసయ్యాడని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఆసుపత్రి బృందం

బోధన్‌రూరల్, జనవరి11 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం వెల్‌నెస్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, ఆస్పత్రి ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిశారు. నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో నిజామాబాద్‌లో వెల్‌నెస్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు.



టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

తాడ్వాయిలో

జోరుగా బెల్టు దందా

● పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

తాడ్వాయి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్‌షాపులు మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఈ బెల్టు షాపు దందా అధికారుల కనుసైగల్లోనే జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదు. కొన్ని గ్రామాల్లో బహిరంగంగా వేలాలు వేసి గ్రామాల అభివృద్ధికి ఖర్చు పెడుతున్నారు. కొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు అమ్ముతున్నారు. వీరికి మండల కేంద్రంలో ఉన్న వైన్స్‌షాపు నిర్వాహకులే సహకరిస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కానీ అధికారులు మాత్రం చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. మద్యానికి బానిసై పచ్చని సంసారాల్లో చిచ్చు రేగుతోంది. కూలీ నాలి చేసుకుని బతికే జీవితాలు రోడ్డు పాలవుతున్నాయి. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లోని యువత తాగుడుకు బానిసై ఏదో ఒక వివాదంలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. గత 15 రోజుల క్రితం మండల కేంద్రంలో మద్యం మత్తులోనే చెట్టుపైకి ఎక్కి దూకిన సంగతి తెలిసిందే. ఎక్సైజ్ అధికారులు మాత్రం ప్రతి నెల మామూలుగా మత్తులోనే ఉంటున్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. గ్రామాల్లోని బెల్ట్ షాపులను వైన్స్ నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నట్లు తెలుపుతున్నారు. వైన్‌షాపుల్లో ఉండని మద్యం బెల్ట్‌షాపులలో దొరుకుతుంది. పలు గ్రామాల్లో పేరుకే కిరాణం దుకాణం అమ్మేది మాత్రం మద్యం అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత ఇండ్లలోనే పెద్దపెద్ద ఫ్రిజ్‌లను పెట్టి బహిరంగంగానే మద్యాన్ని విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. దీనికి వైన్స్ నిర్వాహకులు సహకరిస్తున్నట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీంతో పచ్చని సంసారాలలో చిచ్చు రేగుతున్నాయి. అధికారులు మాత్రం మామూలు మత్తులో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు పట్టించుకుని గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణను అడ్డుకునేట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిజాంసాగర్‌లో

పర్యాటక అభివృద్ధి అయ్యేనా?


● ఏకో టూరిజం కార్యరూపం దాల్చేనా ? ● రెండు నెలల క్రితం 12 ఎకరాల 20 గుంటల భూమి టూరిజం శాఖకు అప్పగింత

● డిసెంబర్‌లో ఏకో టూరిజం స్థలాన్ని పరిశీలించిన మంత్రి ● ఉమ్మడి జిల్లా ప్రజల ఎదురుచూపు

ఆంధ్రజ్యోతి పరిశీలన


ఏకో టూరిజం ఏర్పాటుకు సేకరించిన భూమి


నైజాం హయాంలో ఏర్పాటు చేసిన గార్డెన్


గోల్ బంగ్లా

నిజాంసాగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతాల్లో ఏకో టూరిజం ఏర్పాటు కార్యరూపం దాల్చేనా అని ఉభయ జిల్లాల పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఆనాడు నైజాం ప్రభుత్వ హయాంలో నిజాంసాగర్ పరిసర ప్రాంతాల్లో గార్డెన్‌లను చారిత్రాత్మక కట్టడాలతోపాటు స్విమ్మింగ్ పూల్ సమ్మర్ బాగ్ మరెన్నో కనిపించే బంగ్లాలను చూపరులకు కనువిందు చేసే విధంగా నిర్మాణం చేపట్టి జాతికి అంకితం చేశారు. కాలక్రమేనా గార్డెన్లో ప్రాచీన కట్టడాలు కళాహీనంగా మారాయి. ప్రభుత్వాలు, పాలకులు మారినప్పటికీ నిజాంసాగర్ పరిసర ప్రాంతాల్లో టూరిజం ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలోనే హామీలు ఇస్తూ వచ్చారు ఇప్పటికీ 90 సంవత్సరాలు గడుస్తున్నా నిజాంసాగర్ ప్రాజెక్టు టూరిజం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ప్రాజెక్టు పైన ఉన్న గుల్లస్తగార్డెను గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు వెచ్చించి గార్డెను కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దారు. కానీ అప్పట్లో నిజాంసాగర్‌ని గుల్లస్తి గార్డెన్‌ను టూరిజంగా ఏర్పాటు చేసి నిజాంసాగర్‌లో బోటు షికారు చేయలేకపోయారు. నిజాంసాగర్ ప్రాచీన కట్టడాలు ఇప్పటికే కళాహీనంగా మారాయి. వీఐపీ అతిథి గృహాలు ఎంతో చూడ ముచ్చటగా ఉన్నప్పటికీ వాటి నిర్వహణ నిధుల లేని కారణంగా వాటి నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారింది. గత తెలంగాణ ప్రభుత్వంలో వీఐపీ అతిథిగృహాలను లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేసినా అతిథి గృహాల నిర్వహణకు సిబ్బందిని కేటాయించలేకపోయారు. నిజాంసాగర్ పరిసర ప్రాంతంలోని కింది భాగాన అప్పట్లో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్ ఆనవాళ్లు లేకుండా పోయింది.


నిజాంసాగర్ ప్రాజెక్టు (ఫైల్)

ప్రజాప్రతినిధులు పీఠాన్ని దక్కించుకోగానే నిజాంసాగర్‌ను రాష్ట్రంలోనే అతి సుందరంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇస్తున్నారే తప్ప నిజాంసాగర్ ప్రాచీన కట్టడాలను గార్డెన్‌లను టూరిజంగా ఏర్పాటు చేయలేకపోతున్నారు. నిజాం ప్రభుత్వంలో దాదాపు 30 ఎకరాల్లో సమ్మర్ బాగ్, పండ్ల తోటలు ఏర్పాటు చేశారు. సమ్మర్ బాగ్ 30 ఏళ్ల క్రితమే ఆనవాలు లేకుండా పోయాయి. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిజాంసాగర్ పరిసరాల ప్రాంతాలన్నింటినీ మైసూర్ గార్డెన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కాలక్రమేణా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దివంగతులయ్యారు. మైసూర్‌గార్డెన్ ఏర్పాటుకు అధికార యంత్రాంగం 549 ఎకరాల భూమిని సేకరించి అప్పట్లో ప్రభుత్వానికి నివేదిక పంపారు. తెలంగాణ ఏర్పాటై తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖరరావు తెలంగాణ రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా నిర్మాణం చేపట్టిన నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అప్పట్లో ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జుక్కల్ ఎమ్మెల్యే నిజాంసాగర్ ప్రాజెక్టు పరి సరాల ప్రాంతంలోని గోల్ బంగ్లా సమీపంలో 12 ఎకరాల 20 గుంటల భూమిలో ఏకో టూరిజం ఏర్పాటుకు భూమిని సైతం టూరిజం శాఖకు అప్పగించారు. ఏకో టూరిజం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని డిసెంబర్ 13వ తేదీన భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి టూరిజం స్థలాన్ని కూడా పరిశీలించారు. ఇప్పటికీ టూరిజం ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయింది. ఏండ్ల నుంచి ఇదిగో టూరిజం అదిగో ఏర్పాటు అంటూ వాగ్దానాలకే పరిమితమవుతుందని ఉభయ జిల్లాల వాసులు, పర్యాటకులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గోల్ బంగ్లా పరిసరాల ప్రాంతాల్లో ఏకోటూరిజం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చేట్లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గడికోటకు సందర్శకుల తాకిడి


దోమకొండలో హయత్‌నగర్‌కు చెందిన విద్యార్థులు

దోమకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గడికోటకు శనివారం సందర్శకుల తాకిడి ఎక్కువైంది. రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్‌కు చెందిన వరుణ్స్ మోడల్ హైస్కూల్‌కు చెందిన సుమారు 150 మంది విద్యార్థిని, విద్యార్థులు కోటను సందర్శించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 10 బుల్లెట్ బైక్‌లపై దోమకొండకు చేరుకుని కోట అందాలను తిలకించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి పెద్దఎత్తున సందర్శకులు వచ్చి వెళ్లారు. అద్దాల మేడ, చుట్టూ కందకం, రాజభవనం, శివాలయంతో పాటు వివిధ భవనాలను సందర్శించారు. గడికోట చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

కళాశాల ల్యాబ్ ఆధునికీకరణకు నిధుల మంజూరు


ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

మద్నూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్‌కు అవసరమైన పరికరాల కొనుగోలుకు, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.37 వేల నిధులు మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ పాండురంగ తెలిపారు. ఇంటర్ రెండో సంవత్సరంలో మాత్రమే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులలో ప్రయోగపరీక్షలు నిర్వహిస్తారు. మద్నూర్ జూనియర్ కాలేజీలో ల్యాబ్ అధ్వానంగా ఉండటంతో పాత పరికరాలతోనే ప్రయోగాలు చేస్తున్నారు. అవసరమైన రసాయనాలు లేకపోవడంతో ప్రయోగాలు అంతంత మాత్రంగానే మారాయి. దీంతో ప్రభుత్వం ల్యాబ్‌కు సంబంధించిన పరికరాల కొనుగోలుకు రూ.25 వేల రూపాయలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గత ఏడు సంవత్సరాలుగా విడుదల కాని నిధులు ఈ ఏడాది విడుదల కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్రాక్టికల్స్ జరిగే గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.12 వేలు మంజూరయ్యాయి. సీసీ కెమెరాలకు మంజూరైన నిధులు తక్కువ కావడంతో కెమెరాలు ఏర్పాటు చేయలేదని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

పంచాయతీల్లో కొనసాగుతున్న పాఠశాలలు

● సమస్యల్లో ప్రభుత్వ బడులు ● పిల్లర్లకే పరిమితమైన లింగాపూర్ పాఠశాల ● కుంటుపడుతున్న విద్యా బోధన

కోటగిరి, జనవరి11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం మాటలు నీటి మూటలే అవుతున్నాయి. శిథిలావస్థ భవనాలు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలతో ప్రభుత్వ విద్య పేద విద్యార్థులకు పాలిటశాపంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని గత ప్రభుత్వం తలపెట్టిన మన ఊరు, మన బడి కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలగా పేరు మార్చింది. కాని అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పాఠశాలల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఫలితం లేకుండా పోయింది. పాఠశాల భవనాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విద్యాబోధన కొనసాగుతోంది. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద కోటగిరి మండలంలో 16, పొతంగల్ మండలంలో 17 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, తరగతి గదులు, ప్రహ రీ నిర్మాణం వంటి ప్రధాన పనులు చేపట్టాల్సి ఉంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో గత ఏడాది జూన్ వరకే పనులు పూర్తి కావాల్సి ఉండగా ఈ విద్యా సంవత్సరం ముగిసే లోపైనా పనులు పూర్తి అవుతాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.


పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న విద్యాబోధన

● లింగాపూర్‌లో అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణం

కోటగిరి మండలంలోని లింగాపూర్‌లో పాఠశాల భవన నిర్మాణపనులు పునాదులకే పరిమితమయ్యాయి. రెండేళ్ల క్రితం ఇక్కడ కొనసాగుతున్న పాఠశాల శిథిలావస్థకు చేరడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి మార్చారు. గత ఏడాది 27 మంది విద్యార్థులుండగా ఈ విద్యాసంవత్సరానికి 15 మంది విద్యార్థులకు పడిపోయింది. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం 20 లక్షల రూపాయలు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని తొలగించిన కాంట్రాక్టర్ పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పాఠశాల భవనం పిల్లర్లకే పరిమితమైంది. అదే సమయంలో ఎన్నికలు రావడంతో పాఠశాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పిల్లర్లకే పరిమితమైంది. పాఠశాల ప్రాంగణమంతా పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాఠశాల కొనసాగుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంపూర్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాల నుంచి తరుచూ టాయిలెట్ల పేరుతో ఇంటికి వెళ్లి తిరగి రావడం లేదు. తమ పిల్లలు పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురై ప్రైవేటు పాఠశాలకు తరలించాల్సిన పరిస్థితి తలెత్తింది. గ్రామ పంచాయతీలో పాఠశాల కొనసాగిస్తుండడంతో అటు డ్వాక్రా మహిళలకు సమావేశం నిర్వహించుకునేందుకు భవనం లేకుండా పోయింది. గ్రామ పంచాయతీ సిబ్బంది సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భవనం నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేనిపక్షంలో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితి ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

● కొల్లూర్‌లో ఇదే పరిస్థితి

పొతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మాణానికి 10 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పాత భవనాన్ని కూల్చివేసి పనులు చేపట్టారు. ఇక్కడి పాఠశాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. పాఠశాల భవనం స్లాబ్‌వరకు పూర్తి చేసిన కాంట్రాక్టర్ నిధులు లేకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య 14 మంది ఉండగా క్రమేపి విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. పంచాయతీ భవనంలో విద్యాబోధన కొనసాగుతుండడం, అటు పంచాయతీ అధికారులకు ఇటు విద్యార్థుల తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇప్పటికైనా ఈ పాఠశాలల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

● నిధుల కొరతతో పనులు నిలిచి పోయాయి : శ్రీనివాస్, ఎంపీడీవో,



కొల్లూర్, లింగాపూర్ గ్రామాల్లో పాఠశాల భవనాలు అర్ధంతరంగా నిలిచిపోవడానికి నిధుల లేమీ ప్రధాన కారణం, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైతే పనులు త్వరితగతిన పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాము.


కొనసాగుతున్న విద్యాబోధన

తొర్లికొండలో

వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జనవరి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొండపైకి చేరుకొని స్వామివారి పల్లకిని కొండచుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ముగ్గుల పోటీలు

భీమ్‌గల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని శనివారం విద్యార్థినులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులు సంక్రాంతి ముగ్గులను వేయగా విజేతగా నిలిచిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఏవో నర్సారెడ్డి, కమిటీ సభ్యులు నర్సయ్యలు బహుమతులు అందజేశారు.


నిజామాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

బస్టాండ్‌లో సంక్రాంతి సందడి...

పాఠశాలలు, కళాశాలలతో పాటు కార్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో శనివారం బస్టాండ్ సందడిగా మారింది. ఉదయం నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టళ్లకు వచ్చి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఒకేసారి బస్టాండ్‌కు పిల్లలు, తల్లిదండ్రులు రావడంతో రద్దీ పెరిగింది. సరిపడా బస్సులు లేకపోవడంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. బస్సులో సైతం సీట్లు దొరక్క చాలామంది ఇబ్బందులు పడ్డారు. దూరప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో పడిగాపులు కాశారు. బస్సు సీట్ల కోసం ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. (ఫొటోలు, నిజామాబాద్)


బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



కిటికీల్లోంచి పిల్లలను తీసుకుంటున్న తల్లిదండ్రులు


బస్టాండ్ వద్ద ప్రయాణికుల సందడి



టీటీడీలో స్వామి వారికి గంగాళాలతో పూజ నిర్వహించిన దృశ్యం

వేంకటేశ్వర స్వామికి 108 గంగాళాలతో పూజలు

బీర్కూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శనివారం కూడారై మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 గంగాళాల్లో పాయసాన్ని స్వామి వారికి నివేదన చేసి భక్తులకు ప్రసాదంగా వినియోగించారు. ఆలయ అర్చకులు నందు పంతులు కూడారై ప్రాముఖ్యత గురించి భక్తులకు తెలియజేశారు. తెల్లవారు జామునే మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో ఆలయానికి విచ్చేసి కూడారై ప్రత్యేక పూజలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా

స్థానిక సంస్థల ఎన్నికల్లో
కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా

ఎల్లారెడ్డి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామంలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన వాటిని వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు గొల్లపల్లి మల్లేష్, గంట సాయిలు, గణపతి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

కామారెడ్డి టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని శ్రీ వీరాంజనేయ దేవాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌వీ గౌరవ అధ్యక్షుడు రాంచంద్రం తెలిపారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడునని ఎవరి ముగ్గులు, రంగులు వారే తీసుకురావాలని తెలిపారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని జీవదాన్ పాఠశాల ఆవరణలో నేడు ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఐదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి ఐదు తులాల వెండి, రెండో బహుమతి రెండో బహుమతి మూడు తులాల వెండి, మూడో బహుమతి ఎలక్ట్రిక్ రైస్‌కుక్కర్, నాలుగో బహు మతి గ్రైండర్, ఐదో బహుమతి ఐరన్ బాక్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో ముగ్గుల పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీధర్‌గౌడ్

నాగిరెడ్డిపేటలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నాగిరెడ్డిపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సహకారంతో ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 12 క్రికెట్ టీమ్‌లు పాల్గొన్నట్లు శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.7,777, ద్వితీయ బహుమతి రూ.5,555 నగదుతో మెమోంటోలను అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, రాంచందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్, సరేందర్‌గౌడ్, కిష్టయ్య, రవీందర్‌రెడ్డి, షాహెద్, ఫారూక్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి

ఎల్లారెడ్డి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద శనివారం వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సంగమేశ్వర్, దుర్గన్న, అజయ్, బాల్‌రాజ్, ఇతర ప్రముఖులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. వడ్డెర కులస్తుల కోసం సంక్షేమ బోర్డు పెట్టాలన్నారు. వడ్డెర కులస్తుల కోసం సంక్షేమ మండలి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు సంగమేశ్వర్, దుర్గయ్య, అజయ్, బాల్‌రాజ్, లింగం సాయికుమార్, పరంధాములు, ఎల్లన్న, సాయిలు, నర్సింలు, అబ్దుల్ రజాక్, కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఓబన్న జయంతిని గ్రామ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయా పార్టీల నాయకులు, వడ్డెర సంఘం ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కేవలం రామేశ్వర్‌పల్లిలోనే స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న విగ్రహం ఉందన్నారు. నేటి యువత ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ మద్ది సూర్యకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజారెడ్డి, మాజీ వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, వడ్డెర సంఘం ప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ఓబన్న చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం



రామేశ్వర్‌పల్లిలో..

జాతీయ రహదారిపై తస్మాత్ జాగ్రత్త

● మఫ్టీ పోలీసులమని చెప్పి ఒకరి వద్ద ఆరున్నర గ్రాముల బంగారు ఉంగరం అపహరణ

నిజాంసాగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మేము సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులం అని చెప్పి రోడ్డు వెంట వెళ్లే ద్విచక్ర వాహనాలను ఆపి వారి వద్ద ఆరు గ్రాముల బంగారు ఉంగరాన్ని దోచుకు వెళ్లిన సంఘటన శనివారం 161 ఎన్‌హెచ్‌ఏఐ రహదారిపై చోటు చేసుకుంది. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామానికి చెందిన మాలే వీరేశం అనే వ్యక్తి నరసింగరావు పల్లి నుంచి పిట్లం వెళుతూ ఉన్నాడు. పిట్లం మండలం గద్దగూడ శివారులోని రవీందర్ రెడ్డి దాబాకు కొద్ది దూరంలో రాంగ్ రూట్లో వచ్చిన గుర్తు తెలియని దుండగులు మాలే వీరేశం వెళ్లే వాహనాన్ని అటకాయించి ఆపారు. పిట్లం కొడంగల్‌లో చాలా జంగు జరుగుతోంది. మీరు వెళ్లద్దని మీ వద్ద ఉన్న బంగారాన్ని తీసి దాచుకోండని చెప్పారు. సదర్ వీరేశం చేతికి ఉన్న ఆరు గ్రాముల ఉంగరాన్ని తీసి ఇచ్చారు. నకిలీ ఉంగరాన్ని కాగితంలో మల్చి ఇదిగో నీ ఉంగరం జేబులో పెట్టుకొని తీసుకువెళ్లని చెప్పారు. రహదారి వెంట మరో ద్విచక్ర వాహనం రావడంతో అతను కూడా బంగారం తీసి నకిలీ పోలీసులకు అప్పగించినట్లు వీరేశం తెలిపారు. భయభ్రాంతులకు గురైన వీరేశం నకిలీ ఉంగరాన్ని తీసుకొని నర్సింగరావుపల్లి గ్రామ ప్రముఖులకు ప్రజా ప్రతినిధులకు చూయించారు. ఈ సంఘటన తెలుసుకున్న ఇరుగు పొరుగు గ్రామాల ప్రజలు రహదారి వెంట వెళ్లే వాహనదారులు ఈ రహదారిపై జాగ్రత్తగా ఉండాలని చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పిట్లం పోలీసులకు మాలే వీరేశం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పిట్లం ఎస్సై పోలీసు బలగాలతో సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దారి దోపిడీ కింద కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి

ఏఎస్పీ చైతన్యారెడ్డి



భిక్కనూరులో బైక్‌ర్యాలీ ప్రారంభిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

భిక్కనూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలతో చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ట్రాఫిక్ నిబంధనలను ప్రతీ వాహనదారుడు పాటిస్తే ఈ రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని జిల్లా ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. శనివారం భిక్కనూరు పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా భిక్కనూరులో పోలీసు సిబ్బంది, మండల యువకులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఎస్పీ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్టును ధరించాలన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. అతివేగం పనికిరాదని, వేగం కన్నా ప్రాణం ముఖ్యమని అన్నారు. అనంతరం భిక్కనూరు సర్కిల్ పరిధిలోని దోమకొండ, బీబీపేట, రాజంపేట సిబ్బందికి హెల్మెట్, బ్లూకోల్ట్ జాకెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ అఫోజుద్దీన్, సామ్ రిచరడ్, భిక్కనూరు ఎస్సైలు అంజనేయులు, రాంచందర్‌నాయక్, ఏఎస్సై జగదీష్, రవాణ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం

జిల్లాలో డ్రగ్స్‌పై ఎస్పీ నేతృత్వంలో ఉక్కుపాదం మోపుతున్నట్లు ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. భిక్కనూరు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా డ్రగ్స్, గంజాయి విక్రయించినా.. సేవించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. చేశామన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్ కుమార్, ఎస్సై అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయవచ్చునని జిల్లా ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. శనివారం భిక్కనూరు మండలంలోని కంచర్ల గ్రామంలో గ్రామస్థులు, కేజేఎల్ పౌల్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14సీసీ కెమెరాలను ఏఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని అన్నారు. తమ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇటీవల మృతి చెందిన భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఎంతగానో సహకరించారని మాజీ సర్పంచ్ కుమ్మరి చంద్రం, గ్రామపెద్దలు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై అంజనేయులు, రాంచందర్‌నాయక్, ఏఎస్సై జగదీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

దోమకొండ: శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు ఒకరికొకరు స్నేహభవంతో కలసి జీవించాలని ఏఎస్పీ చైతన్యారెడ్డి అన్నారు. శనివారం దోమకొండ పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దోమకొండ గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి సహకారంతో కామినేని శోభన, అనిల్‌లు ఇందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. కార్యక్రమంలో భిక్కనూర్, బీబీపేట, రాజంపేట ఎస్సైలు డి.ఆంజనేయులు, ఎం. ప్రభాకర్, పుష్పరాజ్, దోమకొండ ఏఎస్సైలు సుబ్రహ్మణ్య చారీ, జాని భాషా, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నల్లపు అంజలి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడికోటను సందర్శించిన ఏఎస్పీ

దోమకొండ గడికోటను ఏఎస్పీ చైతన్యారెడ్డి సందర్శించారు. కోటలోని 400 సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం, అద్దాలమేడ, రాజభవనం, కోట చుట్టూ కందకం, రెండు వైపుల దర్వాజలు, సొరంగమార్గంతో పాటు గడికోట చరిత్రను మేనేజర్ బాబ్జి ఏఎస్పీకి తెలియజేశారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై
గడప గడపకూ ప్రచారం

తాడ్వాయి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై మండలంలోని ప్రతీ గడపగడపకూ ఇంటి ఇంటికీ ప్రచారం చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి ఉపాధ్యక్షుడు గైని శివాజీలు తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అభివృద్ధి తీరును గ్రామాల్లో ప్రచార కమిటీ సభ్యులతో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేషన్ సభ్యులు మోహన్ రెడ్డి, సంజీవ్, గ్రామ అధ్యక్షుడు లింగం, యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, ఆసిఫ్, రఫీ, సత్యం, శంకర్, రాములు, రాజయ్య, హమీద్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాడళేశ్వరస్వామి
ఆలయ ప్రథమ వార్షికోత్సవం

మాచారెడ్డి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కాపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో మాడళేశ్వర స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలచంద్రం, నాయకులు బట్టు రమేష్, గడ్డం బాబు, ఉప సర్పంచ్ మోతుకు ఎల్లయ్య, గ్రామ అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, లింగం, దేవరాజు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

లింగంపేట: మండలంలోని మోతె గ్రామానికి చెందిన క్రీడాకారులకు శనివారం మాజీ జడ్పీటీసీ శ్రీలత దుస్తులను పంపిణీ చేశారు. గ్రామంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారికి యూనిఫాంతో పాటు వాలీబాల్ కిట్స్‌ను అందజేశాడు.

ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బాన్సువాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్, పోచారం తండా గ్రామ యువకుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ మోహన్ నాయక్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తండాలో సంక్రాంతి పండుగకు యువకులు వచ్చిన సందర్భంగా తండా యువకులు అదేవిధంగా పెద్దలు అందరూ కలిసి ఆనంద ఉత్సవాలతో ప్రతీ సంవత్సరం టోర్నమెంట్ నిర్వహిస్తూ ఆనందంగా సంక్రాంతి పండుగ ఉత్సవాలను జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ హరిసింగ్, గోప్య నాయక్, కార్బరీ ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ అంబర్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ హర్యా నాయక్, మోహన్, సీతారాం ఫకీరా నాయక్, దేవి, రమేష్, మోహన్, గంగారం, దన్ను కేతావత్, రఘురాం, దేవీసింగ్, తారాచంద్, రాజేష్, సుధాకర్, లక్ష్మణ్, టోకు, తాండ యువకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మోహన్ నాయక్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సుధీర్ (ఫైల్)

మద్నూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి సోనాల గ్రామానికి వెళ్లే రహదారిపై స్కూటర్- ఆటో ఢీకొనడంతో తరోడే సుధీర్(60) మృతి చెందగా తులసీరామ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రానికి చెందిన సుధీర్ స్కూటర్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా తులసీరామ్ అనే వ్యక్తి ఆటో నడుపుతూ ఎదురుగా వస్తుండగా రెండు వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలైన సుధీర్‌ను ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాందేడ్ ఆసుపత్రికి తరలించారని, శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. గాయాలైన తులసీరామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. మహారాష్ట్ర-నాందేడ్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



వాహనదారులకు గులాబీ పూలు అందజేస్తున్న ఆర్డీవో, సిబ్బంది

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

మద్నూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై క్షేమంగా వెళ్లాలంటూ వాహనదారులకు ఆర్టీవో సిబ్బంది గులాబీ పూలను అందజేశారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మద్నూర్ మండలం సలాబత్‌పూర్ సరిహద్దులో గల చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది. ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కల్పించారు. ఏఎంవీఐ రజిని మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని. అప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యుల తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారని విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ఉపయోగించాలని సూచించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

ఎల్లారెడ్డి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన కాశయ్య అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించడానికి కాశయ్య శనివారం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలోని రామలింగం బాయి, తిమ్మారెడ్డి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మట్టి కుప్పలపై పడటంతో బలమైన గాయాలు తగిలి మృతి చెందినట్లు తెలిపారు. భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

బీర్కూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు యువకులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. బీర్కూర్‌కు చెందిన గంట సాయికుమార్‌కు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక బాలికతో పరిచయం ఏర్పడింది. అయితే సాయి కుమార్ కరీంనగర్‌కు చెందిన గడ్డం వెంకటేష్‌తో కలిసి ఈ నెల 6న బాలికను కరీంనగర్‌కు తీసుకుపోయారు. బాలిక తల్లి అదే రోజు బీర్కూర్ పోలీస్ స్టేషన్లో బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు 7వ తేదీన ఫోన్‌లో సమాచారం ఆధారంగా లోకేషన్ ట్రేస్ చేసి కరీంనగర్‌కు చేరుకున్నారు. గంట సాయికుమార్‌ను, బాలికను పట్టుకున్నారు. వెంకటేష్ తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు ఇద్దరినీ బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టారు. బాలికకు వైద్య పరీక్షలు చేయించి ఐసీడీఎస్ భరోసా కేంద్రానికి తరలించారు. సాయికుమార్, వెంకటేష్‌లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం సాయికుమార్‌ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు వెంకటేష్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గత కొన్ని రోజుల క్రితం కరీంనగర్‌కు చెందిన వెంకటేష్ అనే యువకుడు బీర్కూర్‌లో కొనసాగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో కూలీగా పని చేసేందుకు బీర్కూర్‌కు వచ్చాడు. ఇక్కడే కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల సాయి కుమార్‌కు, వెంకటేష్‌కు మధ్య స్నేహం ఏర్పడింది. ఈ మేరకు ఇద్దరు కలిసి బాలికను కరీంనగర్‌కు తీసుకుపోయినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

రామారెడ్డి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టు తండా గ్రామంలో చేపలకు వేటకు వెళ్లి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామావత్ రవీందర్(28) అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో గల దామర చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు స్థానికులు స్థానికులు వెల్లడించారు. జాలర్లు శుక్రవారం మధ్యాహ్నం నుంచి మృతదేహం కోసం గాలించగా శనివారం మధ్యాహ్నం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉండగా, పెద్ద భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్సై నరేష్ వివరించారు.

16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన

● ఎంపీడీవో పూర్ణచంద్రదోయ కుమార్

దోమకొండ, (బీబీపేట) జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతుబంధు, రైతు ఆత్మీయ జీపీ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన, 21 నుంచి 24 వరకు గ్రామ సభలు, 25న ఆన్‌లైన్ డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందని బీబీపేట ఎంపీడీవో పూర్ణచంద్రదోయ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీం లీడర్‌గా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏవో, నాయాబ్ తహసీల్దార్, టీమ్ మెంబర్లుగా పంచాయతీ కార్యదర్శి ఏఈవో, ఏపీవో, ఏపీఎం, టీఏ, ఈసీ, సీసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉంటారని తెలిపారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

లింగంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రానికి చెందిన మెంగవరం శంకర్‌శర్మ తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ ద్వారా ట్రేస్‌చేసి పట్టుకుని శనివారం ఎస్సై సుధాకర్ బాధితుడికి అందజేశారు. సెల్‌ఫోన్‌లను వారాంతపు సంతలో, ఇతర రద్దీ ప్రాంతాల్లో అపహరిస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలియజేశారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్డా రోమాన్స్
దర్శన్	- యువి
ప్రియా 70	- పుష్ప-2
ప్రియా 35	- గేమ్ చేంజర్

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- మ్యాక్స్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

